

# సాహితీమూర్తుల సహవాసం – నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

## 1

# వినాయకుడి వీణ మీటిన గోరా శాస్త్రి

'జీరాలో ఓ గోరా
దాని పేరే ఓ కోబ్రా'

అంటూ దిగంబర కవులు గోరాశాస్త్రిని దుయ్యబట్టారు. గోరాశాస్త్రి సికింద్రాబాదులోని జీరా ప్రాంతంలో వుండేవారు. ఆయన ఆంధ్రభూమి దినపత్రికకు ఎడిటర్ గా ఉన్న రోజుల్లో కొత్తగా ఏర్పడిన దిగంబర సమాఖ్య తొలి పుస్తకాన్ని విడుదల చేసింది. అందరివలె కాక వినూత్నంగా ఆవిష్కరించామని చెప్పుకున్నారు. దానిపై గోరాశాస్త్రి స్పందిస్తూ – 'అంటే ఏం చేశారు? ఓ కార్మికుడి చేత పుస్తకం మీద మూత్రం చేయించారా?' అని అంటూ ఆయన ఎద్దేవ చేశారు. ఇది 1968లో జరిగిన సంఘటన. అప్పుడే దిగంబర ఉద్యమాన్ని ప్రారంభించిన వారు నగ్నముని, జ్వాలాముఖి, చరబండరాజు, భైరవయ్య, నిఖిలేశ్వర్. విప్లవ ఉద్యమ భాగంగా ప్రారంభించిన వారి కవిత్వంలో దిగంబరత్వాన్ని గోరాశాస్త్రి దుయ్యబట్టారు. గోరాశాస్త్రి కమ్యూనిస్టులను ఎన్నడూ వదిలిపెట్టలేదు. అయితే ఆయన ఆప్తమిత్రులలో శ్రీశ్రీ, రాచకొండ విశ్వనాథశాస్త్రి, సెట్టి ఈశ్వరరావు మొదలైనవారెందరో వుండటం మరో విశేషం.

## గోవిందు రామశాస్త్రి (1919-1982)



మేథావి మొదలు అమెరికా తొత్తు వరకు అనేక భూషణ దూషణాదులకు గురై, ఒడిదుడుకుల జీవితాన్ని 60 పడిలోకి లాగిన గోరాశాస్త్రి పరిణామం విచిత్రమైనది. ఒరిస్సా కోరాపుట్టి జిల్లాలోని తోరమాళ్ గ్రామంలో సుందరి, నరసింహం దంపతులకు 1919 అక్టోబరు మూడున జన్మించిన గోరాశాస్త్రికి అక్షరాభ్యాసం గావించినది ఒకానొక సాయిబట. ...అందుకే ఇలావుంది.. అంటారు. గోరాశాస్త్రి విద్యాభ్యాసం బి.ఎ. వరకే సాగినా, ఆ కాస్తా నగరం, రాజమండ్రి, రామచంద్రాపురం, బరంపురం, భద్రాచలం, కాకినాడలలో జరిగింది. ఆయన విద్యార్థిగా, తెలివితేటల్ని చిలిపితనంతో రంగరించి కొనసాగించిన ఘట్టాలనేకం.

(దశరథ మహారాజు ఎన్నేళ్ళు పాలించెను? అన్న పంతులు ప్రశ్నకు 'చచ్చేంతవరకు' అని శాస్త్రిగారి సమాధానానికి 'నువ్వు రా..!' అని శ్లాఘింపచేసుకున్నారు చిన్నతనంలోనే)

జీవితంలో ప్రవేశించిన శాస్త్రిగారు జర్నలిజంలోకి రాకపూర్వం చేసిన ఉద్యోగాలెన్ని? చూడండి వరస – బొంబాయిలో సినిమా స్టూడియో మేస్త్రీ, ఒకానొక మద్రాసు కంపెనీకి ఆంధ్రలో అమ్మకందారు, ఆంగ్లో-ఇండియన్ లకు విజయవాడలో తెలుగు బోధన, (ఎండలకు తాళలేక మానేసిన వుద్యోగమది), సహకార స్టోర్సు గుమాస్తా, వ్యాపారస్తుల దళారి, రాజమండ్రిలో ప్లాట్ ఫారంపై చిల్లమల్లర పుస్తకాల అమ్మకం, రాజమహేంద్రవరంలోనే ఒక ట్యుటోరియల్ కళాశాలలో ట్యూటర్, ఏలూరులో బియ్యం వ్యాపారం (కొనటానికి వచ్చిన మనుషులు నచ్చకపోతే అమ్మేవారు కాదట), రెండవ ప్రపంచ యుద్ధంకాలంలో విశాఖపట్టణంలో దాడులు గురించిన హెచ్చరిక పని, కొన్నాళ్ళు నౌకాదళంలో స్టోర్ హౌస్ మాన్, ఖుర్దారోడ్ లో రైల్వే రిలీవింగ్ గుమాస్తా. జీవితాన్ని కాచి వడపోయటానికి యింతకన్నా మరేమి చెయ్యాలి? ఆ అనుభవాలెంతకావు!

గోరాశాస్త్రి తెలుగు పత్రికా సాహిత్యరంగంలో గుర్తుపెట్టుకోదగిన వ్యక్తిగా మిగిలారు.

గోరాశాస్త్రి ఆకాశవాణికి నాటికలు రాసేవారు. మదరాసులో ఆనాడు తెలుగువారు చాలామంది వుండటమే కాక తెలుగు కార్యక్రమాలు అక్కడ నుండే ప్రసారమయ్యేవి. అనేకమంది రచయితలు రాజధాని మద్రాసులో వుండేవారు. ఇదంతా ఆంధ్ర ఏర్పడక ముందు ఉమ్మడి మదరాసులోని కథ. ఆకాశవాణివారు ఎప్పుడు అత్యవసరంగా నాటిక కావలసి వచ్చినా గోరాశాస్త్రికి ఫోను చేసి కొన్ని గంటలలోనే మాకో నాటిక కావాలని అడిగేవారు. గోరాశాస్త్రికి అత్యవసరంగా డబ్బులు కావాలి. వారికి నాటిక కావాలి. ఆ విధంగా గబగబా నాటిక రాసి ఇచ్చేవారు. అలా ఎన్నో రేడియో నాటికలు ప్రసారమయ్యాయి.

## గోరాశాస్త్రి – గోరా

గోరాశాస్త్రి – గోరాల మధ్య గందరగోళం జనంలో వుంటుండేది. అందువలన గోరాశాస్త్రి రచనలు చూసి ఇష్టం వున్నవారు లేని వారు తమ అభిప్రాయాలని గోరాకు పంపించేవారు. అలాగే గోరా నాస్తిక ఉద్యమ రీతులు గమనించి వాటిపై తమ స్పందనను గోరాశాస్త్రికి ఘాటుగా తెలియపరిచేవారు. వారిరువురు – అయ్యబాబోయ్ నేను గోరాని కాదు – నేను గోరాశాస్త్రిని కాదు అని సంజాయిషీ చెప్పుకోవలసి వచ్చేది. ఇంతకూ గోరా శాస్త్రి పూర్తిపేరు గోవిందు రామశాస్త్రి, గోరా పూర్తిపేరు గోపరాజు రామచంద్రరావు. విజయవాడ కేంద్రంగా నాస్తిక ఉద్యమాన్ని గోరా నడిపితే, మద్రాసు, హైదరాబాదు కేంద్రంగా గోరా శాస్త్రి రచనా వ్యాసంగం చేసారు. ఇదే తేడా.

1945 డిసెంబరు గోరాశాస్త్రి జీవితంలో పెద్ద మలుపు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో మదరాసు చేరుకున్నారు. ...ఆనందవాణి పత్రికా సంపాదకులు ఉప్పులూరి కాళిదాసు అప్పటికే గోరాశాస్త్రి రచనలు తమ పత్రికలో ప్రచురించటం, యింకా చెంచూరి నాగేశ్వరరావుగారి 'కథానిక' ఆంధ్రపత్రిక, దీపిక, నవశక్తి, శ్రమజీవి పత్రికలలో కథలు ప్రచురితం గావటం, ఆంగ్లంలో రచనలు సాగించటం కద్దు. కారణాంతరాల చేత ఖుర్దా రోడ్డు స్టేషన్ కు వచ్చి గోరాశాస్త్రిని కలిసిన ఉప్పులూరి కాళిదాసుగారే. స్వతంత్రలో శాస్త్రిగారు చేరటానికి కారకులయ్యారు. శాస్త్రిగారి ఆంగ్ల రచనల వాసనలు ఖాసా సుబ్బారావుగారికి చవిచూపి, శాస్త్రిగారిని తంతి ద్వారా పిలిపించి, స్వతంత్రలో చేర్పించటానికి కాళిదాసుగారే నిమిత్తమాత్రులు. అంతటితో శాస్త్రిగారి చిల్లరమల్లర ఉద్యోగాల జీవితం జర్నలిజంలో స్థిరపడింది.

మంతెనవారి పాలెం, కొత్త పట్టణాలలో జరిగిన రాజకీయ పాఠశాలలకు వెళ్ళి, పాల్గొని రాజకీయ అనుభవాన్ని గడించారు. మొత్తం మీద మదరాసు ప్రవేశం శాస్త్రిగారి జీవితంలో ఉచ్చదశ. మదరాసులో ఒక దశాబ్దం పాటు తన ప్రతిభా వ్యుత్పన్నతను, సృజనాత్మక శక్తిని, యితరేతర శక్తులను వెల్లడించటానికి, అవన్నీ పరాకాష్ఠ అందుకోటానికి గోరాశాస్త్రిగారికి ఒక ప్రక్క ఆకాశవాణి, యింకో విధంగా స్వతంత్ర చక్కని అవకాశాన్ని కల్పించాయి. శాస్త్రిగారిచే పుంఖాను పుంఖంగా శ్రవ్యనాటికలు రాయించటానికి నాంది పలికిన వారు బాలాంత్రపు రజనీకాంతరావుగారు. ఆ కృషిని కొనసాగించిన వారు జనమంచి రామకృష్ణ.

## తెలుగు స్వతంత్ర పత్రిక

గోరాశాస్త్రి మదరాసు చేరుకున్నప్పుడు ఖాసా సుబ్బారావు సుప్రసిద్ధ జర్నలిస్టుగా స్థిరపడి వున్నారు. ఖాసా సుబ్బారావు ఇంగ్లీషు స్వతంత్రకు, తెలుగు స్వతంత్రకు గోరాశాస్త్రి ఎడిటర్లుగా ఎంతో ప్రభావం చూపెట్టారు. 'మద్రాసు మెయిల్ మాకు ప్రియబాంధవి' అంటుండేవారు గోరాశాస్త్రి. అప్పట్లో కలకత్తా నుండి మద్రాసుకు నడిచే మెయిల్ ద్వారా ఉత్తరాలు, వ్యాసాలు అందుకునేవారు. తెలుగు స్వతంత్ర ఆనాడు ఎందరో రచయితలకు కాణాచి అయింది. అందులో ఇచ్ఛాపురపు జగన్నాథరావు, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, చలం మొదలైనవారెందరో వుండగా అప్పట్లో యువకవులయిన దాశరథి, సి.నారాయణరెడ్డి తెలుగు వారికి ఈ పత్రిక ద్వారా

పరిచయమయ్యారు. సాహిత్య రంగంలో వైవిధ్యాన్ని తెలుగు స్వతంత్ర ప్రవేశపెట్టింది. గోరాశాస్త్రికి సహాయంగా కె. రామలక్ష్మి (ఆరుద్ర భార్య) వుండేవారు. మదరాసులో ఆనాడు రచయితలకు కొదువ లేదు. అయితే గోరాశాస్త్రి ఎంపిక చేయటంలో గుణానికి ప్రాధాన్యత ఇచ్చేవారు. మద్రాసు సంస్కృతి. సంగీతం, మోర్ మార్కెట్లో చౌకగా లభించే విదేశీ సాహిత్య పత్రికలు, గోష్ఠులు, రచయితల ప్రవాసం అన్నీ గోరాశాస్త్రిని ఆకట్టుకున్నాయి. ఆయన సికింద్రాబాద్ లో స్థిరపడినా చివరి దాకా మద్రాసు అంటేనే అభిమానంగా వుండేవారు. వినాయకుడి వీణ అనే శీర్షిక గోరాశాస్త్రి నిర్వహించారు. ఇందులోని వైవిధ్యం, నిశిత పరిశీలన, వ్యంగ్య విమర్శనాత్మక ధోరణులు పాఠకులను బాగా ఆకట్టుకున్నాయి.

తనతోపాటు చుట్టూవున్నవారిలో వెలుగు ప్రసరింపజేసే సాధనంగా తెలుగు స్వతంత్ర ఉపకరించింది. ఎక్కడ ప్రతిభ వుంటే అక్కడికి వెళ్ళి ఏదోవిధంగా తృణమో, పణమో ముట్టచెప్పో, చెప్పలేకో ఎలాగైతేనేమి వందలాది కొత్త రచయితలను ముఖ్యంగా స్త్రీలను – తెలుగు స్వతంత్ర ఆంధ్రులకు పరిచయం చేయటానికి కారకులు గోరాశాస్త్రిగారే, ఈ విషయంలో గోరాశాస్త్రిగారిని గురించి అందరికీ ఏకాభిప్రాయమే.

**మదరాసు నుండి హైదరాబాదుకు**

స్వాతంత్ర్యానంతరం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత గోరాశాస్త్రి హైదరాబాదు చేరుకున్నారు. ఖాసా సుబ్బారావుగారు 'స్వతంత్ర' నుండి 'స్వరాజ్య'కు పోయారు. 'తెలుగు స్వతంత్ర' హెచ్.జి.రాజా ఆధ్వర్యాన, గోరాశాస్త్రి సంపాదకత్వాన సాగింది. 1957 ఉగాది కానుకగా తెలుగు స్వతంత్ర దివాలా తీసిందని గోరాశాస్త్రిగారికి వార్త వచ్చింది. అప్పటికే గోరాశాస్త్రిగారికి ప్లూరసీ వచ్చింది. తెలుగు స్వతంత్రలో తెలుగు తొలగించి గోరాశాస్త్రి స్వతంత్ర పత్రికను హైదరాబాదు నుండి నడిపారు. అప్పుడు పి.శ్రీదేవి (రచయిత్రి, డాక్టరు) కూడా ఆయనకు చేయూతనిచ్చారు. (కాలాతీత వ్యక్తులు నవల రచించారు). కూడబెట్టిన కొద్ది విత్తనము హరించగా పరిస్థితులు, ప్రతికూలించగా, రావలసిన బకాయిలు యెగవేపగా 'స్వతంత్ర' అదృశ్యాకరమైంది. సికింద్రాబాదులో స్థిరపడిన గోరాశాస్త్రి స్వతంత్రను ఆపేసిన తరువాత తాత్కాలికంగా 'ఆంధ్రప్రభ' దినపత్రికకు ప్రత్యేక ప్రతినిధిగా పనిచేస్తూ, ఆంధ్రభూమి దినపత్రిక ఎడిటర్ అయ్యారు. వారు నడిపే దక్కన్ క్రానికల్ పత్రికకు ఇంగ్లీషు సంపాదకీయాలు కూడా రాసేవారు. హైదరాబాదు ఆకాశవాణికి నాటికలు రాశారు. గోపాల చక్రవర్తి, శశాంక, సి. ధర్మారావు, పి. తిరుమల రావు, మండవ శ్రీరామమూర్తి, ఎస్.వి.పంతులు మొదలగు వారెందరో ఆయన యింటికి నిత్య సందర్శకులు.

సికింద్రాబాద్ లోని జీరాలో అద్దె ఇంట్లో నివశిస్తూ, చివరివరకూ గడిపారు. కొందరు జర్నలిస్టుల వలె గోరాశాస్త్రి సంపాదనలో పడలేదు. ఆయనకు నిత్యమూ ఆర్థిక ఇబ్బందులు వుండేవి. ముగ్గురు అమ్మాయిలు వుండగా పుత్ర సంతానం లేదు. ఖర్చు బాగా వుండేది. అందువలన ఎప్పుడూ సంసార లంపటత్వ కష్టాలలో యీదుతుండేవాడు.

కాని ఒక్క ప్రశ్న మిగిలే వున్నది. శాస్త్రిగారి వ్యక్తిత్వ సారాంశం యేమిటన్నదే ఆ ప్రశ్న. భిన్న కోణాలలో యెవరి అభిప్రాయాన్ని వారు వెల్లడిస్తున్నారు.

యజ్ఞోపవీతం చిన్నతనంలోనే తీసేసినందుకు, సహపంక్తి భోజనాలు చేస్తున్నందుకు భ్రష్టుడన్నారు. కొందరు కులాభిమానులు నాస్తికుడన్నారు. కమ్యూనిస్టులు ఆయన్ను అమెరికా తొత్తు అన్నారు. ఒకానొక స్వతంత్ర నాయకుడు కమ్యూనిస్టుగా శాస్త్రిని భావించి వుద్యోగం తీసెయ్యమని యజమానులకు సిఫారసు చేశాడు. జనసంఘ్ వారు తమ పార్టీ సానుభూతిపరుడేనని ఆయన సంపాదకీయాన్ని ఎన్నికల్లో కరపత్రంగా చేసి పంచారు. ఆ తర్వాత జనసంఘాన్ని ఘాటుగా విమర్శిస్తూ వచ్చిన సంపాదకీయాలు సరేసరి! ఏదో ఒక మూసలో పోసి చూసే తత్వంలో గోరాశాస్త్రి యిమడడు. మానవ విలువలు మినహా, దేన్నీ మూర్ఖంగా అంటిపెట్టుకొనిగాని, అయినదానికీ కానిదానికీ వ్యతిరేకిగానూ లేడు. బహుశా యాంటీ కి యాంటీ ఏమో... ఆయన దినపత్రికకు సంపాదకుడుగా పనికిరాడన్న 'శ్రీ' లేకపోలేదు. కాని ఆయన సంపాదకత్వాన 'ఆంధ్రభూమి' రాజధానిలో ప్రథమశ్రేణి పత్రిక అయింది మరి. అయితే తాను అగ్రశ్రేణి సంపాదకుడిననిగాని, తాను లేకుంటే ఆంధ్ర జర్నలిజం లేదని గాని శాస్త్రిగారు భావించకపోగా, 'యీ జీవితానికి పిండి రుబ్బమన్నా అభ్యంతరం లేదు. అవకాశం యిచ్చేవాళ్లుంటే' అంటారు శాస్త్రిగారు. మీ సంపాదకీయం అసహ్యంగా వున్నదంటే, 'రోజూ అట్లుపోసే ముసలమ్మకు సైతం కొన్ని చీదేస్తయి. రోజూ సంపాదకీయం ప్రత్యక్షర రమ్యతతో రాయాలంటే సాధ్యమా!' ఏవో నెలకు మూడు బాగా రాయగలమంతే.. అని సమాధానం. సంపాదకీయాన్ని విమర్శిస్తూ వచ్చిన లేఖలను ప్రచురించే స్వతంత్ర సత్సంప్రదాయాన్ని నాటి నుండి నేటి వరకు గోరాశాస్త్రి నిలబెడుతూనే వున్నారు. తనను విమర్శించేవారందరినీ విరోధులుగా చూసే లక్షణమూ ఆయనలో లేదు. వ్యక్తిగతంగా చూస్తే సాధారణ మోతాదులో – శాస్త్రిగారిలోనూ వున్నాయి. కానీ కలం పడితే ఎవరినైనా నిష్పాక్షికంగా చూడగల సామర్థ్యం ఆచరణలో వున్నదాయనకు. అదెంతగాదు.

### గోరాశాస్త్రితో నా పరిచయం

ఆంధ్రభూమి సంపాదకుడుగా గోరాశాస్త్రి వున్నప్పుడు నేను ఎన్. శూలపాణి అనే పేరుతో వ్యాసాలు రాశాను. యిలా సంవత్సరాలు యిరువురం పరిచయం లేకుండానే సాగింది. తీరా పరిచయం అయినప్పుడు గోరాశాస్త్రిగారు ఆశ్చర్యపోయారు. ఒకటి పేరు గురించి, రెండు వయస్సు గురించి. గోరా శాస్త్రిగారితో పరిచయం సన్నిహిత స్నేహంగా మారిన తరువాత, తరచు వారి యింట్లో భోజనాలు చేస్తూ ఎక్కువసేపు చర్చలతో కాలక్షేపం చేశాం. అప్పుడే సెట్టి ఈశ్వరరావు (మద్రాసు సోవియట్ కౌన్సిల్ లో ఉద్యోగం), కె. నారాయణరావు (శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు). రమాదేవి (ప్రస్తుత కర్ణాటక గవర్నర్), శశాంక (కవి), భాట్టం శ్రీరామమూర్తి, ఇచ్ఛాపురపు జగన్నాథరావు (రచయిత, ఆఫీసర్), డా. పి. తిరుమలరావు, ఉపద్రష్ట కృష్ణమూర్తి, గోపాలశాస్త్రి (గోపాల చక్రవర్తి) పరిచయమయ్యారు.

## సంపాదకుడుగా గోరాశాస్త్రి

గోరాశాస్త్రిగారి అభిప్రాయాలు, రాగద్వేషాలు బాగా ఘాటైనవి. కనుక ఒక పట్టాన ఆయనకు దగ్గరగా అందరూ వచ్చేవారు కారు. చర్చలలో నిర్మొహమాటంగా ఎత్తిపొడుపులు, ఖండన మండనలు వుండేవి. ఆంధ్రభూమి సంపాదకుడుగా వున్నప్పుడు, దక్కన్ క్రానికల్ సంపాదకీయాలు రాయమని గోరాశాస్త్రిని యాజమాన్యం కోరింది. అది అదనపు పని, శ్రమతో కూడినది అయినా ఆర్థిక యిబ్బందుల కారణంగా గోరాశాస్త్రిగారు అంగీకరించి ఇంగ్లీషు సంపాదకీయాలు రాసేవారు. ఒక్కోసారి అటు తెలుగు, ఇటు ఇంగ్లీషు సంపాదకీయం రాయడం సమయాభావం వలన కష్టం కనుక, వరదాచారి, పొత్తూరి వెంకటేశ్వరరావుకు ఆ పని అప్పగించేవారు. సంపాదకీయాలు రాస్తున్న రోజులలో యించుమించు ప్రతిరోజూ సీతారాం (యునైటెడ్ న్యూస్ ఇన్ఫర్మేషన్ లో జర్నలిస్ట్), కృష్ణలతో ఫోనులో సంప్రదిస్తుండేవారు. పదౌచిత్యం, సరైన అర్థం కోసం గోరాశాస్త్రి సరస ఫోను సంభాషణలు అప్పుడప్పుడు తిట్లవరకు సాగేవి. గోరాశాస్త్రిగారు రానురాను సంపాదకీయాలకే పరిమితమై మిగిలిన ఆఫీసు బాధ్యతలు ఇతరులకు అప్పగించేవారు.

శ్రీశ్రీ, రావిశాస్త్రి అంటే గోరాశాస్త్రికి యిష్టం. శ్రీశ్రీ అభిప్రాయాలతో గోరాశాస్త్రి ఎక్కడా అంగీకరించలేకపోయినా, మద్రాసు రోజులనుండే వారి స్నేహం అలాగే కొనసాగింది. శ్రీశ్రీ సమాచార తృష్ణ ఆయనకు బాగా నచ్చింది. రావిశాస్త్రి హైదరాబాద్ వచ్చినప్పుడల్లా కలుస్తుండేవారు. నేనూ ఆయనతోబాటే కలసి వారి సంభాషణలు విని ఆనందించేవాడిని. రావిశాస్త్రి ఉపమానాలు గోరాశాస్త్రి ప్రత్యేకాభిమానరీతులు. ఉప్పులూరి కాళిదాసు 'ఆనందవాణి' పత్రిక గురించి తొలుత నేను గోరాశాస్త్రిగారి ద్వారానే తెలుసుకున్నాను. చిలవలు పలవలుగా ఆ పత్రిక దాని సంపాదకుడి విషయాలు చెప్పుకునేవారు. అందులో నిజమే ఎక్కువ అని గోరాశాస్త్రిగారన్నారు. అంతేగాక ఉప్పులూరి కాళిదాసును ఆయన ఇంటికి వచ్చినప్పుడు శాస్త్రిగారే పరిచయం చేశారు.

రాజకీయవాదులు ఆట్టే గోరాశాస్త్రిగారి దగ్గరకు వచ్చేవారు కారు. ఆయన కూడా మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవాడు కాదు. ఎప్పుడైనా ఒకసారి పి.వి.నరసింహారావును విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా చూడకపోలేదు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పెట్టినప్పుడు ప్రత్యేకాధికారిగా ఉన్న సరీన్ కు మెహతా అనే వ్యక్తి ఉన్నతాధికారిగా వుండేవాడు. ఆయన తరచు గోరాశాస్త్రిని సంప్రదిస్తుండేవాడు.

గోరాశాస్త్రిగారికి ఎప్పుడూ డబ్బుకు ఇబ్బందే అని చెప్పాను గదా. అది దృష్టిలో పెట్టుకుని కర్నూలులో ఆయనకు 50వ జన్మదిన సందర్భంగా సత్కారం తలపెట్టాం. మండవ శ్రీరామమూర్తి (ప్రస్తుతం విజయవాడలో రిటైర్ అయిన వ్యవసాయ బాంక్ ఆఫీసర్) సి.ధర్మారావు నేనూ పూనుకున్నాం. ఒక సంచిక ప్రచురించాం. కర్నూలు జిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, విద్యామంత్రిగా పి.వి.నరసింహారావు సహకరించగా ఒక సభ జరిపి, గోరాశాస్త్రిగారికి కొంత ఆర్థిక సహాయం వసూళ్ళ ద్వారా అందించగలిగాం.

హైదరాబాద్ లో రేడియో చర్చలలో గోరాశాస్త్రి పాల్గొనేవారు. మద్రాసు నుండే ఆయన రేడియో నాటికల ప్రత్యేకత సాధించారు. 'ఆశ ఖరీదు అణా' అనే నాటిక పాఠకుల మన్ననలు పొందింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని బాగా మెచ్చుకుంటూ, పోగారితనం ఆయన శిల్పంలో వుందనేవాడు. కాని వ్యక్తిగా కృష్ణశాస్త్రి అబద్ధాన్ని జీవించాడనేవాడు.

రామోజీరావుగారు ఈనాడు పత్రిక పెట్టడానికి సంకల్పించినప్పుడు గోరాశాస్త్రిని సంప్రదించారు. హైదరాబాద్ ఆబిడ్స్ లో వున్న మార్గదర్శి కార్యాలయంలో చాలా పర్యాయాలు సాయంకాలాలలో యీ సమావేశాలు జరిగాయి. అందులో నేనూ పాల్గొన్నాను. కొత్త పత్రిక ఎదుర్కోబోయే సమస్యలు, దినపత్రికల తీరుతెన్నులు, విదేశాలలో పత్రికల వ్యవహారం మొదలైన అంశాలు చర్చకు వచ్చేవి. గోరాశాస్త్రి తన అనుభవాల దృష్ట్యా రామోజీరావుతో అనేక అంశాలు చెప్పేవారు. ఆయన శ్రద్ధగా వినేవారు. ఈ సమావేశాలు ఏర్పాటు కొంతకాలం సాగిన తరువాత 'ఈనాడు' వెలువడింది. నేను ఆ చర్చలలో పాల్గొనడం వల్ల గోరాశాస్త్రిగారి మద్రాసు అనుభవాలెన్నో గ్రహించగలిగాను. 1970 ప్రాంతంలో నార్ల వెంకటేశ్వరరావు అన్నా, ఆయన సంపాదకీయాలన్నా గోరాశాస్త్రికి గిట్టేవి కావు. మద్రాసు నుండే వారిరువురికీ సఖ్యతలేదు. ఖాసా సుబ్బారావు గొప్పతనం ఎన్నోవిధాల గోరాశాస్త్రి కొనియాడుతుండేవాడు. టంగుటూరి ప్రకాశం జర్నలిజం గురించి కడుపుబ్బ నవ్వించే విశేషాలు చెప్పేవారు.

స్టీవెన్ స్పందర్ ఆంగ్ల కవిత్వం పట్ల గోరాశాస్త్రికి ప్రత్యేక మోజు వుండేది. గోరాశాస్త్రి సంపాదకీయాలలో కొన్ని, ఆయన నాటికలు, కథలు ఈతరం వారికి అందించవలసి వుంది. గోరాశాస్త్రిగారికి అండగా నిలచి చివరివరకూ సహాయపడిన ఖ్యాతి మిత్రులు సి.ధర్మారావుదే. 'దూరతీరాలు', 'ఆనందనిలయం', 'పరువుకోసం పోతే' వంటి రచనలు పునర్ముద్రణ అయితే బాగుంటుంది. 1982 మేలో ఆయన మరణించిన అనంతరం ఆయనపై ఒక మోనోగ్రాఫ్ ను చక్రధర్ (జర్నలిస్టు) వ్రాశారు. డా.పి.తిరుమలరావు తన స్వీయ చరిత్ర కట్టలుగా రాసి, గోరాశాస్త్రి దగ్గర పడేసేవారు. ఆయన చిత్రిక పట్టి, శైలిపెట్టి, నానాతిప్పలు పడి ఒక క్రమం సమకూర్చేవాడు. ఆ విధంగా అనేకమందికి గోరాశాస్త్రి సాహిత్యసేవ చేశారు.

మానసికారోగ్యాన్ని నిలబెట్టుకోవడానికి శారీరకంగా క్షీణించిపోవటం అవసరమైతే అందుకు శాస్త్రిగారు సిద్ధం. ఒకసారి జరిగిన ఆందోళనల్లో 25 మంది విద్యార్థులు రాత్రి 9 గంటలకు శాస్త్రిగారిని యింట్లో 'ఘెరావ్ చేసి తమ వార్త 6వ పేజీలో యెందుకు వేశారని అడిగితే, యేడవపేజీ లేదు గనక' అని ప్రశాంతంగా గంభీరంగా సమాధానం చెప్పి నిలబడగలిగిన సంపాదకుడు గోరాశాస్త్రి. దినపత్రికలు రాజకీయాల్లో నాయకత్వం వహించాలని ఆయన నమ్మలేదు. స్వస్వరూప జ్ఞానం వున్న వ్యక్తి గనుక సంపాదకీయపు విలువ తూచి చూచాడు.

...దినపత్రిక బ్రతుకు అర్ధగంట. ఆ తర్వాత పకోడి పొట్లాలకే పనికివస్తుంది. కనుక సమయ జ్ఞానం అవసరం అంటారు శాస్త్రిగారు. సంపాదకీయాల్లో ఎత్తుగడ, ...దింపుగడ..ల ప్రస్తావన కాక, ఎంతటి సంక్షోభంలోనైనా తన సహజ లక్షణాలైన హాస్యోక్తి, వ్యంగ్యం. పదాల ఔచిత్యం చూసుకుంటారు. సంపాదకీయాలు చదివేవారెందరో, తర్వాత ప్రభావితులయ్యేవారెవరో ఆయన ముంజేతి

కంకణమే. దినపత్రిక అంటే సంపాదకీయమే కాదనేది స్పష్టంగా తలకెక్కించుకున్న సంపాదకుడు. మరి జర్నలిజంలోకి ఎందుకు వచ్చారంటే 'బ్రతుకుదెరువు కోసమేగాదు. బుద్ధితక్కువై కూడా' అంటారాయన.

లోకాన్ని కొన్నిమారులు వంగి కాళ్ళ సందులోంచి చూస్తాడని శాస్త్రిగారిని ఎవరో అన్నారట. ఔను. ఫలితంగా ఆయనకు మిత్రులకంటే శత్రువులు, తటస్థులే జాస్తి. వారి సంఖ్యను బహుళంగా పెంచటంలో శాస్త్రిగారు యథాశక్తి కృషి చేశారు. చేస్తున్నారు. ఆయన మిత్రులను వేళ్ళ పై లెక్కింపవచ్చు. అభినందించేవారంతా మిత్రులు కాజాలరు గదా!

గోరాశాస్త్రిగారికి సన్మానం చెయ్యాలనీ, సంచిక వెయ్యాలనీ తలపెట్టి, కృషి చేసిన ఖ్యాతి మండవ శ్రీరామమూర్తిగారిది. శాస్త్రిగారు ఆయన్ను అంతగా ఆకర్షించారు మరి. శ్రీరామమూర్తి తలపెట్టిన కృషికి అనన్య సామాన్యంగా సహాయపడినవారు ఉపద్రష్ట శ్రీధరరావు. సి. ధర్మారావుగారలు, కోనేరు కుటుంబరావుగారు యీ కృషిలో వంతపాడారు. సంచిక ముఖచిత్రం శీలా వీర్రాజు వేశారు.

ఆయన రచనలు సంపుటాలుగా రావలసివుంటుంది. చక్రధర్ (జర్నలిస్ట్) ఆయనపై ఒక మోనోగ్రాఫ్ వెలువరించారు.



Sitting : Saskhanka, V. Raja Rao, Gora Sastri, M. Yalla Reddy, Satyanarayana Reddy, Sanjeeva Reddy
Standing : C. Dharmarao, N. Innaiah, K.V. Shiva Sharma, Mandava Sia Rama Murthy. (1969-Kurnool)

(మరో సాహితీమూర్తితో సహవాసం గురించి వచ్చే సంచికలో)

COMMENTS